ఆకాశవాణి విజయవాడ కేంద్రం-వనిత వాణిలో ప్రసారమైన రేడియో కథ :

రచన: శ్రీమతి వలివేటి నాగచంద్రావతి: తేది: 28-9-2019

# దొరికితేనే దొంగలు

శెలవు రోజు. మధ్యాహ్నం భోజనం మయ్యాక ఒక్క కునుకు తీసి లేద్దామని మంచం మీద వాలను. నిద్ర పూర్తిగా పట్టిందో లేదో - గట్టి గట్టిగా అరుపులు. వులిక్కిపడుతూ లేచాను. అది మా ఇంట్లో నుంచి కాదు. అమ్మయ్య అంత వరకు క్షేమం. మళ్ళీ కళ్ళు మూసుకుందామనుకున్నాను, కాని బయట పెరిగిన కేకల స్థాయీ , శృతి మించుతోన్న మాటల జోరు నన్ను మంచం మీద నిలవనీయలేదు. వెధవది - మనది కాని తగవుని చోద్యం చూడాలని ఉత్సాహ పడని మనిషెవ రు చెప్పండి?

బద్ధకం ఒదిలించుని కిటికీ దగ్గరకు వెళ్లి వీలై నంత తొంగి చూసాను. అబ్బే కనబళ్ళా. వీధి తలుపు తీయక తప్పలేదు. అల్లా ఒళ్లు మరిచిపోయి అరుస్తున్నది మా చివరి ఫ్లాట్‌లో వుండే తరుణి గారు. పాపమలా రెచ్చగొడుతున్న కారణం కూడా ఆవిడ ఎదురుగానే వుంది ఆవిడకు ధీటుగా అరుస్తోందా శాల్తీ.

ఏ అవసరం గురించి కట్టారో గానీ చివరి ఫ్లాటుకి ఎదురుగా కాక ఓ పక్కగా పెద్ధ గది ఒకటుంది. దాన్లో వుంటూ న్నారో తల్లి కూతురు ను. పధ్ధెనిమిది సంవత్సరాలు వుండవు ఆ పిల్లకి - అమ్మో పూనకం పూనినట్లు ఎలా అరుస్తోందో -

మూడునెల్లయింది మేమిక్కడ రెంటు కి జేరి. ఈ అపార్ట్ మెంట్స్ లో వాళ్లందరూ మంచి హోదాలో డీసెంట్ గా వుండే వాళ్లే. తరుణి గారైతే ఇంకొంచెం రిచ్ అనిపిస్తోంది నాకు. గది గదికి ఏసీలు, ప్లాస్మా టీవీ, డిష్ వాషర్, మాటల్లో హుదా తనం ......అలాంటిది ఈరోజు మర్యాద కూడా మరిచిపోయి నలుగురు వినేలా ఇంత రూడ్ గా మాట్లాడుతుందేమిటి చెప్మా!

దాదాపు ఓ పావుగంట ధ్యానం చేసుకున్నంత ఏకగ్రతగా ఆలకిస్తే అప్పటికి నాక్కాస్త అర్థమయిందేమిటంటే -

తరుణి గారు బిగ్ బాస్కెట్‌లో తెప్పించుకున్న సరుకుల్ని ఎండొస్తోంది కదా అని ఎదురు గది పక్క బాల్కనీ లాంటి ఖాళీ స్థలంలో ఎండపెట్టారట. ఇందాక చూస్తే అన్నీ వున్నయ్ గానీ జీడిపప్పు ప్యాకెట్‌డొకటి, డ్రైఫ్రూట్స్ ప్యాకెట్‌డొకటి మాత్రం గయబ్.

ఆ కక్కుర్తి పంచేసిన దరిద్రగొట్టు వాళ్ళని కాకి మీద, పిల్లి మీద పెట్టి అందరు వినేలా అంచక్క నోరారా దీవించిందట తరుణి గారు.

"హత్తేరి! ఆ కాకి పిల్లి అటోన్నది మమ్మల్నేనని తెలుసుకోలేనంత తెలివితక్కువ వాళ్ళ మనుకుంటున్నారా? మీ కున్నంత ముదనష్టం మాకు లేకపోవచ్చు గానీ నీతి నిజాయతీకి తక్కువ వాళ్లం కాదు. వెధవ జీడిపప్పుకి, బాదం పప్పుకి మొహం వాచిలేం. జాగ్రత్త. అనవసరం గా దొంగతనాలు అంటగడితే వూరుకునేది లేదు. నోరు అదుపులో పెట్టుకు మాట్లాడండి." కరిచినంత పనిచేసిందా అమ్మాయి.

"నీ పేరెత్తలేదు, వూరెత్తలేదు. నువ్వుకానప్పుడు ఎవ్వరికీరాని పౌరుషం నీకెందుకొచ్చింది? నోరు మూసుకు నుండు." తరుణి గారు కాస్త గూడ తగ్గలేదు.

చినుకు మీద చినుకు జడివాన. మాట మీద మాట పోట్లాట. ఆ అమ్మాయి పేరు అరుంధతి. వాళ్లమ్మ అన్నపూర్ణమ్మ. కూతుర్ని "రావే తల్లి" అని వెనక్కు లాగు తునే వుంది పాపం. ఆఖరికి తరుణి గారే మంగళవాచకం పలికారు. ఛీ, అలగా జనం తో పెట్టుకోటం నాదే బుద్ధి తక్కువ." అలా గొణుగుతూ లోపలికి వెళ్లి ధడాలున తలుపు వేసుకున్నారు. "అదిగో మళ్ళీ - "సెగ తగిలిన దాన్ల తిరిగి విజృంభించబోతే, రెక్క పట్టుకుని లోపలకి లాక్కు పోయింది వాళ్ళమ్మ.

అలా ప్రశాంత మయింది వాతావరణం. ఎం లాభం? అప్పటికే నా నిద్ర కొండెక్కిపోయింది.

* * * * *

ఇహ్ఛరిగి రెండు రోజుల అనంతరం -----

పొద్దున పూట పిల్లలు స్కూళ్లకీ, శ్రీవారు ఆఫీసుకీ వెళ్ళాక ఇల్లెలా ఉంటూందో తెలిసిందేగా - పోనీ నేనే చెబుతాను - సంతయి పోయాక గంపలన్నీ ఎత్తుకు పోయాక మార్కెట్టు ఎలా ఉంటుంది? - అలా వుంది ఇల్లు.

వాళ్లని తిట్టుకుంటూ, నా మీద నేనే జాలిపడుతూ సద్దుకుంటున్నాను. అప్పుడొచ్చారు తరుణి గారు - చేతిలో పళ్లెం, పళ్లెంలో పనస తొనలు, విశాఖపట్నం సంపెంగలు పట్టుకుని.

"రండి రండి" ఆనందంగా ఆహ్వానించాను. పళ్లెం లోకి చూసి కాదు సుమండి!

ఇక్కడకు మేము వచ్చి ముళ్లేలయినా ఎదురైనప్పుడు మందహాసాలు చిందించుకోటం తప్ప, ఫ్లోర్‌లో ఉండే వాళ్లతో పూర్తి పరిచయం లేదు. ఓ మంచి సందర్భం చూసి నేనే వెళ్లి పలకరించుదామనుకుంటున్నాను. అనుకోకుండా ఆవిడంత ట ఆవిడే గుమ్మంలో కొచ్చేసరికి నిజం గానే సంతోషమనిపించింది.

"వైజాగ్ నించి మా అమ్మ పంపిం చింది, సీజనల్ గా తప్ప దొరకని పండు అయిన, పువ్వైనా ముందు గా ఎవరితోనైనా షేర్ చేసుకోవాలంటుంది మా అమ్మ. " తను వచ్చిన కారణం అదేనన్నట్టు అన్నారు తరుణి గారు.

పంచుదామనుకున్న వాళ్లల్లో నాకు ప్రయారిటీ ఇచ్చినందుకు ఇంకా ప్రసన్నమై పోయాను.

కాస్సేపు ఎవరి ప్రవర వాళ్ళు చెప్పుకున్నాం .

తరుణి గారు హైక్వాలిఫికేషన్ వున్నవిడే. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవారట. ఎదుగుతున్న పిల్లలను కనుసన్నల్లో పెట్టుకోటం ముఖ్యమనిపించి అయిదు అంకెల సాలారీ వచ్చే జాబు ని వదిలేసుకున్నారట. ఆవిడంతా కాకపోయిన నేను విద్యాధికురాలినే.

"చూసారుగా. మనకి, చదువు లేని ఆ బ్రూట్స్ కి తేడా" తప్పు తన దగ్గర పెట్టుకుని కూడా ఎలా గొంతు పెట్టుకుని వదిరిందో. వెధవది, మహావుంటే ఓ వెయ్యి రూపాయలు వుంటుంది ఆ డ్రైఫ్రూట్స్ధర . పోతేపోనిమ్మని నేనే ఆ నోటికి నమస్కారము పెట్టాను చివరకి."

"అవునవును చూశా." తల వూపాను.

"పోవటమన్నది ఈ ఒక్కసారే కాదు శాంతగారు. తప్పేదిలేక కామన్ వరండా లో ఎప్పుడైనా బట్టలూ ఆరేస్తానా - ఇక అంతే. నా పెట్టికోట్లు, చేతి కర్చీఫ్ లు, టవల్సు, న్యాప్కిన్లు, లాంటివి ఎన్ని మాట్లు మాయమయ్యాయో! -

వాళ్లే దొంగ లని తెలిసినా ఆ గయ్యాళ్లి పిల్ల నోటికి దడిచి ఏం మాట్లాడను. మొన్ననే కోపం తట్టుకోలేక బయట పడిపోయాను."

"తీసింది వాళ్ళేనంటారా? వచ్చి పోయే వాళ్ళు వుంటారుగా?" నాకు సందేహాలు ఎక్కువ.

"భలే వారు శాంత గారూ. పట్టపగలు ఈ చిల్లర సామన్ల కోసం ఈ నాల్గో ఫ్లోర్ దాక వచ్చి పోయే దొంగలెవరుంటారు?

పనిమ్మాయి చీకటి తో వచ్చెళ్లి పోతుంది. పాల వాడు, పేపర్ వాళ్ళు పై దాక రానే రారు. బుట్టలో పడేస్తే తాడుతో పైకి లాకుంటాం. పది గంటలు తర్వాత గానీ నేను వాషింగ్ మెషిన్ ఆను చేయను. కాక పోతే ఈ ఫ్లోర్లో వాళ్ళు కాక నాలుగు అపార్ట్మెంట్లు ఉన్నాయి. లాయర్ ప్రభాకర్ గారు, డాక్టర్ ధనుంజయ్ గారు, మీరు, మేము. (మనకి చిల్లర దొంగతనం చేసే అవుసరం లేదు కదా). ఇక ఆవిడేమో వంటలు చేస్తు బతికేస్తోంది. మాధవి క్లాత్ ఫ్లోర్లో సేల్స్ గర్ల్ ఆ పిల్ల. ఇప్పుడు చెప్పండి. కార్చీఫ్లూ, జీడి పప్పులూ దొంగలించాల్సిన ఖర్మ వీళ్లలో ఎవరికింటుందో.

'రీజను సరయినదే.' అంగీకారం గా తలూపాను.

"మా అమ్మమ్మ అంటుండేది. వియ్యానికయినా కయ్యానికైనా సమాన స్థాయి వుండాలని. నిజమే కదా. సమాన స్థాయి గల వాళ్ళు పక్క వుంటేనే మనకు ఓ మర్యాద మన్నన ఉంటుంది. లేదంటే చూసారుగా మొన్న లేబర్ వాళ్ళు లాగా, నన్ను అరిపించారు

ఇంతకీ తరుణి గారి డిమాండ్ ఎమిటంటే అన్నపూర్ణమ్మ గారిని ఆ గది ఖాళీ చేయించాలని. మాటలతో సరిపెట్టలేదావిడ. నెక్స్ట్ ఆదివారం లేడీస్ మీటింగ్లో ఈ ప్రపోజల్ పెట్టింది.

ఇరవై నాలుగు ఫ్లాట్లున్న చిన్న అపార్ట్మెంట్ సముదాయం మాది. అన్నపూర్ణమ్మ గారిని వెళ్ళగొట్టడానికి తటస్థంగా వుండిపోయిన నేను తప్ప, మిగతా వాళ్ళందరూ వ్యతిరేకించారు. అందుక్కారణం ఆ తల్లి కూతుళ్ల మీద ప్రేమో, తరుణి గారంటే ద్వేషమో కాదు. అన్నపూర్ణమ్మ గారు ఇక్కడ వుండటం లో ఓ సాదుపాయం వుంది. అందరికీ, ఎవరికి అవసరం వచ్చినా అడగ్గానే వచ్చి వంట చేసి పెట్టి వెడుతుందట. అప్పడాలు, వడియాలు, ఊరగాయలు లాంటి నిల్వ ఉంటే ఆదరువులు కొద్దిగా ప్రతిఫలం తీసుకుని శుచిగా, శుభ్రంగా, రుచిగా తయార చేస్తుందట. ఈ అపార్ట్మెంట్స్లో వాళ్ల చిరుతిళ్లకి స్వీట్

షాప్‌కి పరిగెట్టాల్సిన అవసరం లేకుండా జంతికలు, కారపూసలు, అరిసెలు ..... ఒకటేమిటి ఏమడిగితే అవి ఇంటికి వచ్చి చేసి పెడుతుందట. "అవిడేం చేసినా అమృతమే. చవగ్గా వచ్చేస్తాయి కూడా." అన్నది మూడు ఫ్లోర్‌లో వుండే వనజ. "తినటం తప్పా చేసుకోటం చేతగాని నా బోటి వాళ్ళకి ఈ ఒనరు పరప్రసాదం." అన్నది కాదంబరి. ఆవిడ రైల్వే హాస్పిటల్ లో నర్సు. మొదటి అంతస్తులో ఉంటారట. "అవునవును" ఒప్పుకున్నారు మిగతా వాళ్ళు.

"ఆ అమ్మాయి కాస్తంత గడుగ్గాయి కానీ అన్నపూర్ణమ్మ గారు చాలా సౌమ్యురాలు. మావి, అవి ఇవి పోయాయంటున్నారు. వాళ్ల మీద మీకు అనుమానం. నిజం దేవుడి కెరుక. మా కేవరికి ఆ ప్రాబ్లమ్ రాలేదు. పైగా వాళ్ళు వుండడం మాకు చాలా సౌకర్యం గా వుంటుంది. మీ ఒక్కరి కోసం అందరం అంత సౌకర్యాన్ని ఒదులుకోగలమా చెప్పండి? దానికంటే ఒక పని చేయకూడదు. మీ వస్తువులు బయట వున్నప్పుడు వాటి మీద ఓ కన్నేసి జాగ్రత్త పడితే పోతుందేమో ఆలోచించండి."

అలా ఆ తీర్మానం వీగిపోయింది. మొహం గంటుపెట్టుకొని లేచిపోయారు తరుణి గారు. "సమస్య ఈవిడిది కదా. వాళ్ళకేందుకుంటుందీ నెప్పి?" సానుభూతి గా అనిపించింది నాకు. "ఖరిదయినవి కూడా పోతున్నాయా తరుణి గారు?" అడిగాను. ఇద్దరం కలిసే వెనక్కొస్తున్నాం లెండి. నేనాలా అడగం గానే పాపం తనగోడు వెళ్ళబోసు కునేందుకు ఒక శాల్తీ దొరికిందన్న ఫీలింగ్ కనిపించింది తరుణి గారిలో.

నా చెయ్యి పట్టుకొని, "అలా వెడదాం రండి." అంటూ రైలింగ్ దాక తీసుకు వెళ్ళింది.

"పోయినవి కాస్ట్లీవా? కాదా? అన్నది సమస్య కాదు శాంత గారు. ఆఫ్ట్రాల్ వెయ్యో రెండు వేలో చేసే చిల్లర వస్తువులు పోతున్నాయన్న చింత కాదు నాది. అలాంటి లోక్లాస్ పీపుల్స్ పక్కకుండడాన్ని అయితే ఎలాగో అడ్జస్ట్వతున్నాను, గాని నేను భరించలేనివి వాళ్ళ బుద్ధులని. అందరిలా వాళ్ళు నలుడి వంశం వాళ్ళని, భీముని చుట్టాలని చెక్క భజన చేయటం ఆకాశాని కెత్తటం నాకు చేతకాదు. వచ్చిన కొత్తలో ఆవిడ చేత రవ్వలడ్డు చేయించా. లడ్డులో రవ్వ సరిగ్గా వేగలేదు. పంచదార తగ్గింది. లడ్డు గుండ్రం గా నిలబడలేదు. ఆ మాట మొహమాటం లేకుండా చెప్పాను, తప్పా? అయినా ఆవిడ అడిగినంత మని ఇచ్చేసా కూడ.

రెండ్రోజు లాగి డబ్బు ఇవ్వండంటూ మళ్లీ వచ్చిందా పిల్ల. ఇచ్చానంటే నమ్మదే. ఆ మొండి తనానికి మండింది నాకు. "ఓ పదో, ఈరవయ్యో కావాలంటే అడిగి తీసు కోవాలి గాని ఇదేం పద్ధతి." అని అరిచా. అప్పుడు కామ్ అయిపోయింది.

ఇంకోసారి ఎంతో అవసరం పడి పిలిస్తే కుదరదని చెప్పించ్చింది తల్లి తో. ఆ పిల్లకు ఎంత తలబిరుసో చూడండీ.- నేను అబద్ధాలాడుతానట. నాకు గీర్వాణ మట. ఇంటికి వస్తే వాళ్ళతో అధారిటీ గా మాట్లాడతానట. దాష్టికం చేస్తానట. నా వెనక ఎన్ని వాగుతోందో?



11

పక్కలో బల్లానుంచు కున్నట్లు అట్టాంటి పొగరు బోతుల్ని, నీతి నిజాయతీ లేని వాళ్లని, కక్షతో ఎప్పుడు కాజేసి బాధ పెడదామా అని కాచుకునున్న వాళ్లని పొరుగున వుంచుకోటం ఎలాగో చెప్పండి? నా వరకు ఏ విషయంలోనైనా కరెక్ట్ గా వుంటాను. నా సరౌండింగులో వుండే వాళ్ళు కూడా అలా వుండకపోతే తట్టుకోలేను. "నుదుటి ముడి విడలేదావిడకి". మాకు పనిచేసే దుర్గ కూడా అదే అన్నది. ఆ తరుణమ్మ ఖరా ఖండి మనిషమ్మా. ఒక్క రోజు నాగా పెట్టినా జీతం తెగ్గోట్టేస్తుంది. ఇదేమంటే డబ్బు లేకుండా పై పని ఏమన్నా చెయ్యమంటే నువ్వు చేస్తావా? అని నిలేస్తుంది. అల్లా అయితే ఎట్లానమ్మ పట్టు,విడుపు వుండద్దా?" అని.

మా వాచ్ మెన్ "టాంకులు కడగాలిసిన తేదీలు, ఏ రోజు ఏ పని చేస్తానని, ఏగ్గొట్టానో లేదా, వాయిదాలు వేసానో కాలేండర్ మీద డేట్ రౌండప చేసి మరీ తప్పెత్తి చూపిస్తుందా మేడం, మరి అంత నిక్కచ్చితనం పనికిరాదు." అంటాడతను నిరసనగా .

మా అపార్ట్మెంట్ దగ్గరగా వుండే జనరల్ స్టోర్స్ ఓనర్ కామెంటేమిటంటే "తరుణి మేడం అంత విచిత్రమైన మనిషిని నేను చూడలేదమ్మా. సీల్ చేసిన ప్యాకెట్లు కూడా తూకమేయిస్తుంది. అయిదో పదో గ్రాములు తగ్గితే ధరలో తగ్గించి మరీ ఇస్తోంది. ప్రతి కష్టమర్ ఇలా చేస్తే మేం వ్యాపారం మానుకోవాల్సిందే." అంటాడు.

* * * *

"అమ్మా."

వంటింటి గట్టు మీద ఉల్లిపాయలు కట్ చేసుకుంటున్నాను. వెనకనించి రెండు చేతులతో అమాంతం గా వాటేసుకుంది నా గారాల కూతురు తేజు. ఉలిక్కిపడి వీపు చరుచు కోవాల్సి వచ్చింది. "హూ! స్కూలు నించేగా వచ్చింది! అండమాన్స్ నించోచ్చినట్టు ఆ ఎక్స్ప్రెషన్ ఏమిటీ? కసురుకున్నాను.

అదేంపట్టించు కోలేదు, అది మాములు గానే, ఎగిరి గట్టెక్కి కూర్చున్నది - "బహుత్ భూఖ్ లగ్ రహా హాయ్ మాతాజీ." అంటూ నేనిచ్చిన పాస్తా ప్లేటందుకుని, "అమ్మా , తరుణి ఆంటీ ఏవేవో చాడీలు చెబుతుంది గానీ, అరుంధతి చాలా మంచిదమ్మా." అన్నది.

"అడక్కుండానే ఈ కాండక్ట్ సర్టిఫికేట్ ఎందుకు?" ప్రశ్నార్థకం గా చూసాను.

"మొన్న డొనేషన్ అడగటానికి వెళ్ళినప్పుడు "షాపులో ఇంకా జీతం ఇవ్వలేదు బేబీ" అన్నది. అదో వంక అనుకున్నాను. ఇప్పుడు వచ్చే స్తుంటే పిలిచి మరీ చేతిలో పెట్టింది అయిదు వేలు."

"అయిదు వేలా?: నోరావలించాను.

"వాళ్ళ షాప్ లో వాళ్ళందరిని కూడా అడిగిందట. అదీ, ఇంకో మూడు వేలు తనది కలిపి ఇచ్చింది."

వారం రోజుల్లో వచ్చే గాంధీ జయంతి సందర్భంగా తేజు చదివే హైస్కూల్‌లో 'కస్తూర్బా ఆర్ఫనేజీకి విరాళం ఇవ్వాలని వాళ్ల ప్రిన్సిపాల్ ప్రపోజ్ చేశారట. ఎవరెంత తేగలరో చూస్తాను' అని సవాల్ కూడా విసిరారట. అదీ హడావుడి.

అప్పట్నించి ఖాళీ దొరికినప్పుడల్లా చుట్టుపక్కల మిగతా అపార్ట్మెంట్ వాళ్లని కూడా చందా అంటూ తెగ పీడిస్తోంది మా తేజు.

అది సరే, ఇంతో, అంతో వున్న వాళ్ళం నేనే తెగించి ఐదు వందలు కన్నా ఎక్కువ ఇవ్వలేక పోయాను. అలాంటిది ఓ వంట లక్క కూతురు అంత ఉదారం గా ఐదు వేలు ఇచ్చే సిందా? అది దాన గుణమా - అలా అనిపించుకోవాలని తహ తహ -- ?

"వాళ్ళమ్మ గారు ఏమన్నారో తెలుసా? మా బోటి వాళ్ళం వారథెలాగూ కట్టలేం. ఇది ఉడతా సాయం, అది కూడా నువ్వు మా కివ్వ బట్టే. ఇందాక నువ్వన్నావే, ఆ థాంక్స్ మేమే నీకు చెప్పాలి" అంది. నువ్వేమన్నాఅను, చాలా మంచిగా అనిపించిదప్పుడు –

ఆ తరుణి గారూ వుంది --

"ఊ... ఊ. చాల్లే. ఓసారి చెప్పావు గా." మందలింపుగా వారించను, దాని నిరసన నచ్చక.

మా తేజు వసూళ్లు మొదలెట్టింది తరుణి గారి తోనే. "నేనీ చందాలని అస్సలు నమ్మను. ... చెప్పు.... మొత్తమంతా అసలు వాళ్ళకు ముడుతుందా? ఊహూ.. వచ్చిన దాన్లో సగం మిమ్మల్ని పోగేసుకు రమ్మన వాళ్ళే మింగేస్తారు. అందుకే ఎవరికన్న సాయం చేయాలనుకున్నప్పుడు నేనే వెళ్లి వాళ్ళ కేమి కావాలో అడిగి కొనిపెట్టి వస్తాను." అన్నదట.

"ఈవిడిచ్చె వంద, రెండు వందలకి సాక్షి సంతకాలు, స్టాంప్ పేపర్లు, నోటరీలు కావాలి కాబోలు." రుసరుస లాడిందప్పుడే మా తేజు.

నవ్వొచ్చింది. బాధ కూడా వేసింది. ఎదుటి వాళ్ల అమాయకత్వాన్ని అలసత్వాన్ని అలుసు గా తీసుకొని ఆడుకోవాలనుకునే వాళ్ల మోసాన్ని ఎదురించాలనుకునే ఆవిడ గొప్ప వ్యక్తిత్వం, ప్చ్, ఈ పిల్ల కాకికి ఎలా అర్థమౌతుంది.

* * * * *

నేను కష్టపడి భోదించి ఒప్పించకుండానే అమోఘమైన ఆమె వ్యక్తిత్వం మా తేజు కి తేటతెల్లం గా తెలిపోయింది.

ఎలాగంటారా - - ?

"ఇది నాది." వాచ్ మన్ చేతిలో నోటు లాక్కుంటూ ఉద్రేకం గా అరిచేస్తోంది నా కూతురు.

"ఆగాగు. ఏమిటా దుడుకుతనం ? దగ్గర గా వెడుతూ కొప్పడ్డాను.

"ఇది చూడమ్మా - ఇది నాది కాదా?" మోహానికి దగ్గర గా తెచ్చింది నోటుని. రెండు వేల రూపాయల నోటది. 'పిచ్చా-వెర్రా? నోటు మీద నీది నాది అని రాసి వుంటుంది ఏం' కానీ యదాలాపం గా దాన్ని చూసి స్తన్నయ్యాను. అవును ఆ నోటు తేజుదే.

వారం రోజుల కిందట ఫీజు కని దానికిచ్చిన పైకం లో ఈ నోటుంది. ఆ నోటు మీద తేజు పుట్టిన సంవత్సరం, నెల, తేదీ కలసిన సీరియల్ నెంబెరుంది. 2004831. అది చూడగనే ఇది నాది. నేను దాచుకుంటా. " అంటూ తేజు దాన్ని చేతికి తీసుకుందావేళ.

హెచ్చరిస్తూ వెళ్ళిపోయింది. 'మరది, హటాత్తు గా వాచ్ మన్ చేతి లోకి ఎలా వెళ్ళింది?'

"నా కెక్కడి దమ్మా. ఇప్పుడే తరుణమ్మ గారు 'మైంటైనన్స్' కోసం ఇచ్చారు." అన్నాడు వాచ్ మన్ అయోమయం గా.

'తరుణి గారి దగ్గర కెలా ఆ తర్వాత స్కూల్కి వెళ్ళే తొందరలో ఆ నోటుని నా కిచ్చి, దీన్ని మార్చొద్దు సుమా! అని వెళ్లిందా ఆ నోటు!'. బుర్రలో ఆలోచనలు సుళ్లు తిరుగుతూ కరెంటు పుట్టించాయి. బల్బు వెలిగి కథంతా గుర్తు కొచ్చేసింది.'

ఆ రోజు నా చేతిలో వున్న నోటుని, "నా వాలెట్ ఎక్కడుందో చూసి తెచ్చి ఇవ్వు - ఆఫీసు కి టైమయ్యింది - " అని మా వారు కంగారు పెట్టేసరికి లైబ్రరీ నించి తెచ్చిన విశ్వనాథ సత్యనారాయణ గారి వెయ్యి పడగల పుస్తకం, పక్కనే టేబుల్ మీదుంటే ఆదరా బాదరా ఆ పుస్తకం మధ్య పేజీలో ఆ నోటు పెట్టేసి వాలెట్ వేట పనిలో పడిపోయి దాని సంగతే మరిచిపోయాను. పుస్తకం .... పుస్తకం.... ఆ.... అవును. తరుణి గారు ఇంటికొచ్చారా రోజే. "అరె. విశ్వనాథ గారు వ్రాసిన పుస్తకాలు చదువుతారా మీరు. వండ్రఫుల్. చాలా రోజుల క్రితం చదివానిది. ఇంకోసారి తిరగేస్తాను." అంటూ తీసుకొని వెళ్ళింది. రెండు రోజుల్లో తిరిగి తీసుకు వచ్చి ఇచ్చేసింది కూడా.

"మరా నోటు !..... నోటు!....."

"నోటా? రుద్రాక్ష పిల్లి గారు దాన్ని జాతీయం చేసారు." అల్లరిగా కొంచెం నవ్వుతో. ఈ గడబిడేమిటో అడిగి పోదామని దగ్గర కొస్తున్న తరుణి గారి వంక గుంభనం గా చూస్తో అంటోంది మా తేజు. వాచ్ మన్, వాడి చేతిలో నోటు వాదించుకుంటున్న మమ్మల్ని చూసే సరికే నెత్తురు లాగేసినట్లు తెల్లబడి పోయి, అంతలోనే అద్భుతం గా రక్తం చిమ్మినట్లు ఎర్రబడి పోయింది తరుణి వదనం. జీర్ణం కానట్లు నా గొంతులో ఏదో అడ్డు పడుతోంది.

*సమాప్తం*